# ఆచి తూచి.. ఆలోచించి ఓటెయ్యండి

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఓటర్లకు పిలుపు**

సికింద్రాబాద్, నవంబరు 28: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా మార్చి, ప్రజలకు సంక్షేమ ఫలాలను అందించడంతో పాటు వారి అవసరాలను నిరంతరం తీర్చుతున్నామని డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాల్లో కార్పొరేటర్లు, నేతల ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. నగర డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి, కార్పొరేటర్లు హేమ, శైలజ, సునీత, ప్రసన్న లక్ష్మి, యువనేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్ గౌడ్, త్రినేత్ర గౌడ్, సీనియర్ నేతలు మోతె శోభన్ రెడ్డి, కరాటే రాజు, కంది నారాయణ, శ్రీనివాస్‌లతో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఈ బైక్ ర్యాలీల్లో పాల్గొన్నారు. ముందుగా సీతాఫల్‌మండి వద్ద నుంచి బైక్ ర్యాలీని పద్మారావు గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ, సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 50 ఏండ్లలో చేపట్టని ఎన్నో పనులను కేవలం గడచిన పదేళ్ల వ్యవధిలోనే తాము చేపట్టామని తెలిపారు.



సీతాఫల్‌మండిలో స్థానిక కార్పొరేటర్ హేమతో కలిసి ద్విచక్ర వాహన ర్యాలీలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ తదితరులు

## బైకు ర్యాలీతో బోరబండలో మాగంటి ప్రచారం

ఎర్రగడ్డ, నవంబర్ 28: ఎన్నికల ప్రచారంలో చివరిరోజు బోరబండలో పార్టీ శ్రేణులు బైకు ర్యాలీ నిర్వహించాయి. వందలాది మంది కార్యకర్తలు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. డివిజన్ నలుమూలలా నిర్వహించిన ఈ ర్యాలీలో జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పాల్గొన్నారు. డివిజన్ అధ్యక్షుడు కృష్ణ మోహన్, విజయకుమార్, ఇన్‌ఛార్జి సిరాజ్, ఆనంద్ కుమార్, యూసుఫ్, బాబానాయక్, బాబూరావు, ఏడీ మధు, రమేష్ యాదవ్, శివ కుమార్ గుప్తా, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.



బోరబండలో జరిగిన బైకు ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే గోపీనాథ్

## వివేకానంద్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

**బౌరంపేట్‌లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ప్రచారం**

దుండిగల్, నవంబర్ 28: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే వివేకానంద్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకుందామని ప్రభుత్వ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జి శంభీపూర్ రాజు అన్నారు. ఆయన దుండిగల్ మున్సిపాలిటీ – బౌరంపేట్‌లో ఎమ్మెల్యే వివేకానంద్‌కు మద్దతుగా స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, నేతలతో కలిసి మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ రాజు ఓటర్లను కలిసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి వివేకానంద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈవీఎంలోని మూడో నంబర్‌లో ఉన్న కారు గుర్తుపై ఓటు వేయాలని డెమో చూపుతూ ఓటర్లకు వివరించారు. బీఆర్‌కు మద్దతు పలకడం ద్వారా సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం పీఠంపై కూర్చోబెట్టేందుకు హ్యాట్రిక్ విజయం అందిద్దామన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తేనే ప్రజల జీవితాలు మరింత బాగుపడుతాయన్నారు. విపక్ష పార్టీలకు చెందిన నేతల మాయలో పడొద్దన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.



బౌరంపేట్‌లోని కిరాణ షాపు వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

## మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్ సాగర్‌ను ఓడించాలి

- **నకిలీ పత్రాలు సృష్టించి మా ప్లాట్ల ఆక్రమణకు యత్నించాడు**
- **ఉద్యోగ, దళిత బహుజన ప్లాట్ ఓనర్స్ సొసైటీ కార్యదర్శి గోపాల్ రావు పిలుపు**

హిమాయత్‌నగర్, నవంబర్ 28: తమ ప్లాట్లను ఆక్రమించి వేధింపులకు గురిచేస్తున్న మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.ప్రేమ్‌సాగర్ రావును ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని ఉద్యోగ, దళిత బహుజన ప్లాట్ ఓనర్స్ సొసైటీ కార్యదర్శి జి.గోపాల్ రావు మంచిర్యాల ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని వంపుగూడ గ్రామంలో 639, 643, 644, 647, 648, 654 సర్వే నంబర్లలో ఉన్న 62 ఎకరాల్లో 1982లో పట్టాదారుల నుంచి 706 ప్లాట్లను కొనుగోలు చేసినట్లు తెలిపారు. 2004 కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రేమ్‌సాగర్ రావు తమ ప్లాట్లపై కన్నేసి నకిలీ పత్రాలు సృష్టించి తమ ప్లాట్లను ఆక్రమించనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు ప్లాట్లను సర్వే చేసి తమ భూములుగా తేల్చడంతో అక్కడ కొంత మంది ఇండ్ల నిర్మాణాలను చేసుకుంటే, అతని అనుచరులను పంపించి కూల్చివేయిస్తున్నాడని విమర్శించారు. తమకు న్యాయం చేసి భూములు దక్కేలా చూడాలని కోరారు.




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రావు

## కేసీఆర్ పాలన గిరిజనానికి స్వర్ణయుగం

- **లంబాడీల వ్యతిరేక పార్టీ కాంగ్రెస్**
- **30న ఆ పార్టీకి బుద్ధి చెప్పాలి**
- **బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం**
- **మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ శంకర్ నాయక్**

ఖైరతాబాద్, నవంబర్ 28: తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నాయకత్వమే గిరిజనులకు స్వర్ణయుగమని గిరిజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు మాజీ ఆర్టీఐ కమిషనర్ డాక్టర్ గుగులోతు శంకర్ నాయక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ గిరిజనులపై చూపుతున్న వివక్షను ఖండించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీకి 11 సార్లు ఓట్లు వేసినా గిరిజనుల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదన్నారు. మాయమాటలు చెప్పి గిరిజనులను మోసగించడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. గిరిజన, లంబాడీలకు టికెట్ల కేటాయింపులో సైతం అన్యాయం చేసిందని, గిరిజన తెగల మధ్య చిచ్చు పెట్టడానికి ఎస్టీ తెగలను వర్గీకరణ చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రకటించడం దురదృష్టకరం అని అన్నారు. ఈ ఎన్నికల్లో వెయ్యి రూపాయలు, సారా సీసా ఇస్తే ఓట్లు వేస్తారని వ్యాఖ్యానించి యావత్ గిరిజనాన్ని కించపరిచారని, వారి ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి 30న గిరిజనులు ఓట్ల రూపంలో పాతాళంలోకి తొక్కివేయాలన్నారు. స్వరాష్ట్రం లో గిరిజనులకు గతంలో ఎన్నడూ లేని విధంగా పది శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు 3,500లకు పైగా తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చారన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడానికి గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేశారని, విదేశాల్లో చదువుకునేందుకు రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నారని, గిరిజన లంబాడీల ఆత్మగౌరవానికి ప్రతీకగా బంజారాహిల్స్‌లో బంజారా భవన్ నిర్మించారన్నారు. బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. గిరిజన యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి సీఎం ఎస్టీ ఎంట్రప్రీనియర్ ద్వారా కోట్ల రూపాయల వరకు రుణ సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. గిరి వికాస్ పథకం ద్వారా బోర్లు వేసి మోటారుతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించారన్నారు. గిరిజన విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించడానికి కోచింగ్ కేంద్రాల ఏర్పాటు, గురుకులాలకు మౌలిక సదుపాయాల కల్పన లాంటి కార్యక్రమాలను చేపట్టారన్నారు. గిరిజన సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌కు హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని, ప్రతి గూడెం, తండాలకు వెళ్లి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించాలని, 30న పోలింగ్ సందర్భంగా ప్రతి ఒక్కరు బీఆర్ఎస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శంకర్ నాయక్ తదితరులు

## బీఆర్ఎస్‌కు పెరిగిన ఆదరణతోనే విజయం ఖాయం

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, గోషామహల్ ఎన్నికల ఇన్‌ఛార్జి కోలేటి దామోదర్ గుప్తా**

అబిడ్స్, నవంబర్ 28: గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజాదరణ పెరిగిందని, దీంతో తమ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధించడం ఖాయమని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌ఛార్జి కోలేటి దామోదర్ గుప్తా పేర్కొన్నారు. గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నంద కిషోర్ వ్యాస్ బిలాల్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరి సింగ్, పార్టీ నాయకులు ఆనంద్ సింగ్‌లతో పాటు పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులతో నిర్వహించిన బైక్ ర్యాలీలో వారు పాల్గొన్నారు. అనంతరం, కోలేటి దామోదర్ గుప్తా మాట్లాడుతూ, గోషామహల్ నియోజకవర్గం ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, అభివృద్ధి బీఆర్ఎస్ ద్వారానే సాధ్యమని గుర్తించి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రజల సహకారంతో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి దోహదపడతాయని తెలిపారు. గోషామహల్ నియోజకవర్గం నుంచి నంద కిషోర్ వ్యాస్ విజయం సాధిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడతారని తెలిపారు. అదే విధంగా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి అభివృద్ధి పనులను చేస్తారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, బీఆర్ఎస్ అభ్యర్థి నంద కిషోర్ వ్యాస్ బిలాల్, తదితరులు